ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

గురువారం 25 జనవరి 2024





అధికార పార్టీలో సమన్వయకర్తల మార్పు చిచ్చు

'పార్టీ జెండాలు మోసేది, బ్యానర్లు కట్టేది మేము. పార్టీ కార్యక్రమాలకు జనాన్ని సమీకరించేది, ఇంటింటికి తిరిగి ప్రచారం చేసేది మేమే. అయినా మాకు పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోతోంది. తాడేపల్లి ప్యాలెస్‌లో షాడో సీఎంలు కూర్చుని ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. డబ్బుంటే చాలా.. పార్టీలో పని చేయకున్నా టిక్కెట్లు ఇస్తారా? నచ్చని వారిని మానెత్తిపై బలవంతంగా రుద్దుతున్నారు. ఇలాంటి ధోరణి ఎంతమాత్రం సహించం. కాదూకూడదంటే పార్టీనే వీడతాం. పదవులు త్యజిస్తాం. ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తాం.' ఇవి ప్రస్తుతం వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల నోటి నుంచి వినిపిస్తున్న ధిక్కారపు మాటలు. జిల్లాలో సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేలను పక్కన పెట్టి నూతన సమన్వయకర్తలరె నియమించడంతో వైసీపీలో అసంతృప్తి చిచ్చురేగింది. అది కార్చిచ్చులా మారి అన్ని నియోజకవర్గాలకూ వ్యాపిస్తోంది. పెనుకొండ, కదిరి, మడకశిర సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పుచేర్పులను నిరసిస్తూ అధిష్టానంపై శ్రేణులు రాజీనామాల అల్టిమేటం చేసినా పట్టించుకోలేదు. రూ.కోట్లున్న వారిని ఇన్‌చార్జిలుగా నియమించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, ద్వితీయశ్రేణి నాయకులు రాజీనామాలకు సిద్ధమయ్యారు. వైసీపీ అధిష్టానం బుజ్జగింపులకు దిగింది. తమ మాటకు విలువలేనపుడు పార్టీలో కొనసాగడం ఎందుకంటూ పక్క పార్టీలవైపు చూస్తున్నారు. ఇటీవల కదిరి, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో టీడీపీలోకి చేరికలను బట్టి చూస్తే వైసీపీలో కొత్త సమన్వయకర్తల నియామకం ఏస్థాయిలో చిచ్చు రేపుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి పుట్టపర్తి

- అధిష్టానంపై పెరుగుతున్న అసంతృప్తి
- శాంతకు పార్టీ శ్రేణుల సహాయ నిరాకరణ
- టీడీపీ వైపు నేతల చూపు





వైసీపీ.. వీడితే పోలా..!





పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నారాయణను తప్పించి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే మంత్రి ఉషశ్రీ చరణ్‌ను ఇన్‌చార్జిగా నియమించడం పట్ల అధిష్టానంపై పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మంత్రి ఉషశ్రీచరణ్ వద్దంటూ నియోజకవర్గ వ్యాప్తంగా శంకర్‌నారాయణ అనుచరవర్గంతోపాటు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రాజీనామాలకు సిద్ధమయ్యారు. ధర్నాలతో నిరసన గళం వినిపించారు. కళ్యాణదుర్గంలో మంత్రికి పరిస్థితి సానుకూలంగా లేదనీ, ఆమె ఇతర ప్రాంతానికి వెళ్లిపోతే చాలు అంటూ అక్కడి పార్టీ శ్రేణులందరూ మొక్కుకుంటున్నారన్నారు. అలాంటి మంత్రిని పెనుకొండలో పోటీ చేయిస్తే ఓటమి తప్పదని వారు ఉద్ఘాటిస్తున్నారు. అయినా శంకర్‌నారాయణను బలవంతంగా అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపి, మంత్రి ఉషశ్రీచరణ్‌ను శ్రేణులు వద్దంటున్నా పెనుకొండ ఇన్‌చార్జిగా నియమించడంతో నాయకులు.. అధిష్టానంపై అసంతృప్తి వెల్లగక్కుతున్నారు. శంకర్‌నారాయణ వర్గీయుల్లో చాలామంది మంత్రి వెంట వెళ్లడంలేదు.

మంత్రి.. మాకేల..?



పెనుకొండ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలు సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కొందరు నేతలైతే పార్టీని వీడి టీడీపీవైపు చూస్తున్నారు. టీడీపీ తరఫున పెనుకొండలో ఎవరు పోటీ చేస్తారనే దానిపై స్పష్టత వచ్చేదాకా ఆగుదాం అన్న ధోరణిలో కొందరు వైసీపీ నేతలతోపాటు క్యాడర్ కూడా ఉందన్న ప్రచారం సాగుతోంది.

రిజర్వ్‌డ్ స్థానంలో ధిక్కారం

నాలుగో జాబితాలో మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామిని పక్కన పెట్టి వైసీపీ అధిష్టానం కొత్త ముఖాన్ని తెరపైకి తెచ్చింది. మడకశిర సమన్వయకర్తగా ఈర లక్కప్పను ఎంపిక చేయడంపట్ల పార్టీలో ఆగ్రహజ్వాలలు ఎగసిపడుతున్నాయి. కనీస గుర్తింపులేని వ్యక్తిని సమన్వయకర్తగా ఎలా నియమిస్తారంటూ సిట్టింగ్ ఎమ్మెల్యే వర్గీయులతోపాటు అసమ్మతి నేతలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌గా పనిచేసిన, పార్టీ సభ్యత్వం గుర్తింపు కూడాలేని ఈర లక్కప్పను సమన్వయకర్తగా ఎలా నియమిస్తారంటూ గుడిబండలో వైసీపీ నేతలే ఆరోపణలు గుప్పించారు. పార్టీని వీడేందుకు కూడా సిద్ధంగా అన్నట్లు అధిష్టానంపై ధిక్కారం మొదలైంది. ఇలా అన్ని మండలాల్లో అధిష్టానంపై అసమ్మతి గళం వినిపించాలని నిర్ణయించినట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

పుట్టపర్తి సీటుపై పీటముడి

పుట్టపర్తి అసెంబ్లీ స్థానం విషయంలో వైసీపీలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే సహకరించే ప్రసక్తేలేదని టిక్కెట్ ఆశిస్తున్న వైసీపీ నేతలు గళం విప్పారు. తమ మాటను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ శ్రీధర్‌రెడ్డినే బరిలోకి దింపితే ఓడిస్తామనీ, అసమరమైతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. వారం కిందట కదిరిలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి నివాసంలో పుట్టపర్తి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ సమన్వయకర్త సోమశేఖర్ రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్ రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, వైద్యుడు నాగేంద్రకుమార్ రెడ్డి సమావేశమై.. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా గళం విప్పారు. టిక్కెట్ ఆశిస్తున్న నేతలంతా ఒకే వేదికపైకి రావడంతో పుట్టపర్తి వైసీపీలో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. ఇదే అంశంపై మంత్రి పెద్దిరెడ్డి వద్ద పంచాయితీ పెట్టారు. ఈనేపథ్యంలో టిక్కెట్ ఆశిస్తున్న కొందరి నేతలను సీఎం క్యాంపు కార్యాలయానికి పిలిపించి, చర్చించారు. తనకే అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో చెరువులను కష్టాజలాలతో నింపుతానంటూ పాదయాత్ర మొదలు పెట్టారు. పాదయాత్రకు అసమ్మతి నేతలతోపాటు నియోజకవర్గంలో పలువురు ప్రజాప్రతినిధులు దూరంగా ఉంటున్నారు. అధిష్టానం అభ్యర్థి ప్రకటన తరువాత భవిష్యత్తు కార్యాచరణకు అసమ్మతి నేతలు సన్నాహాలు చేస్తున్నారు. మళ్లీ సిట్టింగ్‌కే కేటాయిస్తే సహకరిస్తారా.. తిగురుబావుటా ఎగురు వేస్తారా అన్న చర్చ సాగుతోంది. నియోజకవర్గంలో వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు కొందరు టీడీపీ వైపు చూస్తున్నారు. రెండ్రోజుల క్రితం సీఎం జగన్ ఎదుటే అసమ్మతి గళం విప్పడం సంచలనం రేపింది.

కదిరిపై పెద్దిరెడ్డి పెత్తనమేంటి?



వైసీపీ కదిరి సమన్వయకర్తగా మక్బుల్ అహ్మద్‌ను నియమించడంపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. డబ్బుంటే పార్టీలో పనిచేయకున్నా టిక్కెట్లు ఇస్తారా అంటూ మండిపడుతున్నాయి. వైసీపీ రెండో జాబితాలో కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డికి మొండిచేయి చూపడంపట్ల ఆయన అనుచరులతోపాటు కొందరు ప్రజాప్రతినిధులు పార్టీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం పట్ల ఆగ్రహావేశాలతో లోలోపల రగిలిపోతున్నారు. కొత్త సమన్వయకర్తకు ఎమ్మెల్యే సిద్దారెడ్డితోపాటు ఆయన వర్గీయులు సహకరించడం లేదు. టిక్కెట్‌పై ఆశలు పెట్టుకున్న బత్తల హరిప్రసాద్, మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్, మరికొందరు నేతలు మాట వరుసకు కూడా తమతో చర్చించకుండా తాడేపల్లిలో కూర్చుని, అధిష్టానం ఏకపక్ష నిర్ణయం తీసుకుందంటూ మండిపడుతున్నారు. కొత్త సమన్వయకర్త మక్బుల్‌కు ఎమ్మెల్యే వర్గీయులు సహకరించకపోడంతో వారిపై దండోపాయం ప్రయోగించి, దారికి తెచ్చుకోవాలని అధిష్టానమే ఆదేశాలివ్వడం వైసీపీ నేతలకు మిగుడుపడడం లేదు. పార్టీ కోసం జెండా మోసి, బ్యానర్లు కట్టి, సభలకు జనాన్ని తరలించి, ఆర్థికంగా నష్టపోయి ఇంటింటా పథకాలపై ప్రచారం చేస్తే తమపైనే దండోపాయం చేస్తారా అంటూ తీవ్రంగా మండిపడుతున్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గంలో వైసీపీ నుంచి నేతలు, శ్రేణులు.. టీడీపీలోకి క్యూ కడుతున్నారు. మరికొందరు సంప్రదింపులు సాగిస్తున్నారు. నష్టనివారణ కోసం మంత్రి పెద్దిరెడ్డి రంగంలోకి దిగి.. బుజ్జగిస్తున్నా.. వినేలా లేరు.

శాంతకు సహకారం కరువు..

హిందూపురం సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పక్కన పెట్టి బళ్లారి బీజేపీ మాజీ ఎంపీ శాంతను హిందూపురం ఇన్‌చార్జిగా వైసీపీ అధిష్టానం నియమించింది. ఆమె పార్టీలో పని చేసిందీ లేదు, ఈ రాష్ట్రం కూడా కాదు. అయినా ఆమె అలా పార్టీలో చేరడం, హిందూపురం ఇన్‌చార్జిగా ఎంపిక చేయడం పట్ల పార్టీ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నాయి. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఆమెకు పార్టీ క్యాడర్ సహకరించట్లేదన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పార్లమెంటు పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆమెకు పార్టీ క్యాడర్ నుంచి ఎదురుగాలి వీస్తోంది. శాంత స్థానికేతరురాలైనా హిందూపురంలో పార్టీ అవకాశం కల్పించిందంటే.. పార్టీకి ఏమేరకు కప్పం కట్టారోననీ, రూ.కోట్లుంటే టిక్కెట్ ఇస్తారా అన్న చర్చ అధికార పార్టీలో రగులుతోంది. పార్లమెంటు పరిధిలోని మూడు నియోజకవర్గాలు మినహా ఎక్కడా అనుకూల వాతావరణం కల్పించలేదని అధిష్టానానికి ఆమె చెప్పినట్లు పార్టీవర్గాలు చర్చించుకుంటున్నాయి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కొత్త సమన్వయకర్తలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు సహకరించకపోగా.. ఎంపీ అభ్యర్థి పరిస్థితి మరోలా ఉంది. గోర్లంట మాధవ్ సామాజిక వర్గం వైసీపీ అధిష్టానం తీరుపై గుర్రుగా ఉంది. శాంత స్థానికేతరురాలు కావడంతో వైసీపీ క్యాడర్‌లో నిరుత్సాహం నెలకొంది. టీడీపీ, జనసేన ఉమ్మడి పోటీలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియమితురాలవడంతో వైసీపీ క్యాడర్‌లో ఆందోళన నెలకొంది. ఇక రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్న భావనతో అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ అసమ్మతి నేతలతోపాటు ద్వితీయ శ్రేణి క్యాడర్ టీడీపీవైపు చూస్తోంది.



- వేడుకలు, పర్యటనలకు సొంత డబ్బు వెచ్చించాల్సిన దుస్థితి
- అందని బిల్లులు
- ఈసారీ జేబులో నుంచి ఖర్చు పెట్టాల్సిందే..!
- హడలిపోతున్న అధికారులు
- బయటకు చెప్పుకోలేక.. లోలోపలే ఆవేదన



ముఖ్యమంత్రి, మంత్రులు, కేంద్ర, రాష్ట్రస్థాయి అధికారులు ఎవరు వస్తారన్నా.. అధికార యంత్రాంగంలో టెన్షన్ మొదలవుతోంది. వారి పర్యటన ఖర్చులు, అతిథి మర్యాదలు అన్నీ యంత్రాంగమే భరించుకోవాలి. బిల్లులు పెట్టుకోండి.. చెల్లిస్తాం.. అంటూ పాలకులు, ఉన్నతాధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారే తప్ప.. ప్రభుత్వం నుంచి పైసా వచ్చింది లేదు. స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలు, ప్రభుత్వం నిర్వహించే అధికారిక పండుగలు, దినోత్సవాల ఖర్చులూ యంత్రాంగమే భరించాల్సి వస్తోంది. ఇలా.. అతిథులొచ్చినా.. వేడుకలొచ్చినా అధికారులపై రూ.లక్షల్లో భారం పడుతోంది. బిల్లులు పెట్టుకున్నా.. ప్రభుత్వం నుంచి పైసా కూడా రాదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పైసా కూడా చెల్లించాలని అధికారులు వాపోతున్నారు. అంత డబ్బు చేతుల నుంచి పెట్టుకోవాలంటే ఎలా అని వారు ఆవేదన చెందుతున్నారు. బయటకు చెప్పుకోలేక లోలోపలే మదన పడుతున్నారు. ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల ఖర్చులూ అధికారులు భరించక తప్పని పరిస్థితి. దీంతో ఆ వర్గాల నుంచి తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

ఆంధ్రజ్యోతి పుట్టపర్తి





ఖర్చులు భరించలేం బాబోయ్..!

ఓవైపు ప్రొటోకాల్ అతిథి మర్యాదలు.. మరోవైపు జాతీయ పండుగల ఖర్చులు అధికార యంత్రాంగానికి తడిసి మోపెడవుతున్నాయి. 'బిల్లులు పెట్టండి చూద్దాం..' అని ప్రతిసారీ పాలకులు చెబుతున్నారే తప్ప.. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి పైసా అందిందీ లేదు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి బయటకు చెప్పుకోలేక ఆందోళన చెందుతున్న వైనం జిల్లా అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. ఈనెల 26న గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలనీ, ప్రభుత్వ శాఖల నుంచి శకటాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏర్పాట్లపై ఈనెల 23న జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోపాటు జిల్లా ప్రగతిపై శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో పలుశాఖల యంత్రాంగంలో ఆందోళన మొదలైంది. పైసా నిధులివ్వకుండా ప్రగతి శకటాలు ఎలా ఏర్పాటు చేసేదని పలు శాఖల అధికారులు పెదవి విరుస్తున్నారు.

పైసా ఇవ్వకుండా.. ప్రగతి శకటాలెట్లా..?

పుట్టపర్తి జిల్లా కేంద్రంగా ఏర్పాటుతో ఇప్పటికే రెండుసార్లు స్వాతంత్ర్య దినోత్సవాలు, ఓసారి గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రగతి శకటాలను ఆయా శాఖలు ప్రదర్శించాయి. అంతాబాగానే ఉన్నా శకటాల ప్రదర్శన కోసం పెట్టిన ఖర్చులో చాలా శాఖలకు పైసా కూడా రాలేదు. ప్రగతి శకటాన్ని ప్రదర్శించాలంటే రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షలదాకా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలవాలంటే అనంతపురం నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. అందుకు ముందస్తు అడ్వాన్సులు కూడా చెల్లించాలి. వేడుకల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా బడ్జెట్‌లో పైసా నిధులు రాకపోవడంతో పలు శాఖల్లో ఒక్కో శకటానికి రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. తాజాగా ఈనెల 26న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఈనెల 23న జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రగతిపై ఆయా శాఖలు శకటాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో యంత్రాంగంలో టెన్షన్ పట్టుకుంది. గణతంత్ర వేడుకల నిర్వహణ సమీక్షలో ఖర్చుల అంశాన్ని పలు శాఖల జిల్లా అధికారులు లేవనెత్తారు. అవన్నీ తమ వద్ద చెప్పొద్దనీ, ఏర్పాటు చేయాల్సిందేనని ఉన్నతాధికారులు హుకుం జారీ చేశారు. దీంతో మళ్లీ నిధులు ఎట్లా సమకూర్చుకోవాలని యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. గతంలో పెట్టిన ఖర్చులే చేతికి రాకపోగా.. మళ్లీ ఎట్లా ఏర్పాటు చేసేది అన్న ఆందోళన అధికార యంత్రాంగంలో నెలకొంది. ఈ శకటాల ఏర్పాట్లను అనంతపురంలోని అధికార పార్టీకి చెందిన ఓ ఏజెన్సీ నిర్వహిస్తుండడంతో వారు చెప్పిన ధర చెల్లించాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయి. పాతవి ఇస్తేనే కొత్తగా శకటాలను సమకూర్చుతామని ఏజెన్సీ తెగేసి చెబుతోంది. గతేడాది డిసెంబరులో మడకశిరలో పర్యటించిన ఓ మంత్రి, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారికి ఖర్చులతోపాటు అతిథి మర్యాదలు చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోందనీ, అదంతా తమ జీతాల నుంచి ఇచ్చుకోలేమనీ, అందుకే లంచాలు అడుగుతామంటూ ఓ రైతుపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేసిన వీడియో వైరల్ అయింది. దీంతో మడకశిర తహసీల్దార్‌ను అప్పట్లో సస్పెండ్ చేశారు. ఈ పరిణామం అధికార యంత్రాంగంలో ఆలజడి రేపింది. వైసీపీ పాలనలో సీఎం, మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనలకు పలు శాఖల అధికారులు పెట్టిన ఖర్చుల బిల్లులు పైసా చెల్లించకపోగా.. కార్యాలయంలో స్టేషనరీ ఖర్చులకు కూడా వెతుక్కోవాల్సి వస్తోంది. అతిథి మర్యాదలు, పండుగల ఖర్చులు భరించలేక జిల్లా అధికార బాధ్యతలను తప్పిస్తే చాలు అంటూ వేడుకునే పరిస్థితి కొత్త జిల్లాలో నెలకొంది.




డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటరు జాబితా

తప్పుల కుప్ప..!

ఓటరు తుది జాబితాలోనూ తప్పిదాలు

- మరణించిన వారికి చోటు..
- బతికున్నవారివి తొలగింపు
- పురంలో వందల్లో డబుల్ ఎంట్రీలు

హిందూపురం, జనవరి 24: ఓటరు తుది జాబితా కూడా తప్పులతడకగా ఉంది. విపరీతంగా తప్పులు దొర్లాయి. బతికున్న వారిని చనిపోయినట్లు ఓట్లు తొలగించారు.. చనిపోయిన వారి ఓట్లను కొనసాగించారు. పురంలో వందల సంఖ్యలో డబుల్ ఓట్లు బయటపడ్డాయి.

రాజకీయ ఒత్తిళ్లు..?

హిందూపురం నియోజకవర్గంలో గతం నుంచి ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని చెబుతున్నా తుది జాబితాలో సైతం అలాగే ఉంచడాన్ని బట్టి చూస్తే బీఎల్‌ఓలపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా.. వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. బీఎల్‌ఓలు ఒకచోట కూర్చుని పనిచేశారు తప్ప.. ఇంటింటికీ వెళ్లి తప్పులు సరిదిద్దలేదన్నది ప్రతిపక్షాల ఆరోపణ. దానిని రుజువుచేస్తూ తుదిజాబితాలో సైతం డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి ఓట్లు అలాగే వెలువడ్డాయి.

ఇవిగో లోపాలు..

పట్టణంలోని రహమత్‌పురంలో 86, 87 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎజాజ్ అనే పేరు ఉంది. 102 సీరియల్ నంబరులో చిన్న అక్షరాల్లో పేరురాగా, 961లో పెద్ద అక్షరాల్లో వచ్చింది. ఒక సీరియల్‌లో లేట్ చాంద్‌బాషా రాగా మరో దానిలో చాంద్‌బాషా లేట్ తండ్రిపేరు కింద వచ్చింది. ఇందులో డోర్ నంబరు కూడా ఒకటే. పట్టణంలోని నానెప్పనగర్‌లో 75, 76 బూత్‌ల పరిధిలో సీరియల్ నంబరు 420, 536 కింద మహ్మద్ అన్సార్, అశ్వాక్ పేరు తప్పుగా ఉంది. తండ్రి పేరు మహ్మద్ అన్సార్ అని డోర్ నంబరు ఒకటే ఉంది. బూత్‌నంబర్లు 37, 38 పరిధి ఆర్టీసీ కాలనీలో సీరియల్ నంబరు 696, 259 ఓటరు పేరు అఫీజ్, తండ్రిపేరు ఇలియాజ్ ఒకే డోర్ నంబరు. ఆర్టీసీ కాలనీ 5వ క్రాస్ ఒకదానిలో ఉండగా ఎంపీయూపీ పాఠశాల ఆర్టీసీ కాలనీ మరోదానిలో ఉంది. చిలమత్తూరు మండలం మరుసలపల్లి బూత్ నంబరు 215లో సీరియల్ నంబర్లు 151, 156లో హరీష్, తండ్రి పేరు నరసింహప్ప ఒకే డోర్ నంబరులో రెండుపేర్లు ఉన్నాయి. చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి, పట్టణంలోని రహమత్‌పురం బూత్ నంబరు 81, 240లో ఒకేపేరుమీద ఓట్లు ఉన్నాయి. రెండుచోట్ల ఒకేలా ఉన్నాయి. ఇలా డబుల్ ఎంట్రీల పేర్లు సుమారు 3202 ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో కొన్ని పేర్లు పక్క పక్క బూత్‌లలో ఉండగా.. మరికొన్ని వేరే మండలాల్లో ఉన్నాయి. వారు ఎక్కడి ఓటరని ఇప్పటికీ అధికారులు గుర్తించకపోవడం గమనార్హం.

తప్పుల తడకే

అధికారులు చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేస్తున్నారనడానికి తుది జాబితాయే నిదర్శనం. గత నెలలో హిందూపురం నియోజకవర్గంలో 800 నుంచి 900 మంది మృతిచెందిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయని అధికారులకు చెప్పినా కేవలం 200లోపు మాత్రమే తొలగించినట్లు కొత్త జాబితాను బట్టి తెలుస్తుంది. దీనిని బట్టి అధికారులు ఓటరు జాబితా ఎలా తయారుచేశారో తెలుస్తుంది. తుది ఓటరు జాబితా వచ్చేసింది. ముసాయిదా జాబితాలో దొర్లిన తప్పులు తరువాత ఇచ్చిన షెడ్యూల్‌లో నూతన ఓటర్ల మార్పులు చేర్పులు అర్జీలు తుదిజాబితాలో నమోదు చేశారో.. లేదో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనిని బట్టి ఓటరు జాబితా తప్పుల తడకేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

నిర్లక్ష్యం.. బహిర్గతం..



తుది జాబితాలో రుక్మిణి ఓటును తొలగించిన దృశ్యం


ధర్మవరం: పట్టణంలోని 165వ పోలింగ్ బూత్ పరిధిలో జీకిష్టప్ప, రుక్మిణి, మణెమ్మ ఓట్లు గత జాబితాలో ఉన్నాయి. తుదిజాబితా వచ్చే సరికి డెలీషన్ లిస్టులో ఉన్నాయి. ముదిగుబ్బ మండలం సీసీరేవు గ్రామానికి చెందిన పోతుల లక్ష్మీదేవి, అశ్వత్థరెడ్డి ఓట్లు ధర్మవరం పట్టణంలోని 165వ పోలింగ్ బూత్ పరిధిలో నమోదు చేశారు. అనంతపురంలో ఉంటున్న కృష్ణమూర్తి ఓటు కూడా ధర్మవరంలో ఉంది.

మరణించినా.. తొలగించలేదు..

తాడిమర్రి: మండల కేంద్రంలోని 21వ పోలింగ్ బూత్ పరిధిలో 285 సీరియల్ నంబరులోని తలారి పెద్ద వెంకటరాముడు చనిపోయి ఐదేళ్లు గడిచినా ఓటరు జాబితా నుంచి తొలగించలేదు. రెండేళ్ల క్రితం మృతిచెందిన సీరియల్ నెంబర్ 166లోని క్రిష్ణ, 145లోని వేమయ్య, 159లోని పెద్ద ఓసూరు పేర్లు అలాగే ఉన్నాయి. 223, 224లోని ఓటర్లు గ్రామాన్ని వదిలిపెట్టి రాజంపేటలో స్థిరపడ్డారు. అయినా వారిపేర్లు జాబితాలో ఉన్నాయి. వీటిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినప్పటికి సిబ్బంది సహకరించలేదన్న విమర్శలు ఉన్నాయి.


మృతిచెందినా తుది ఓటరు జాబితా నుంచి తొలగించని ఎం కృష్ణ ఓటు

తొలగని మృతుల ఓట్లు


మృతిచెందినా ఓటరు జాబితాలో పేర్లు ఉన్న దృశ్యం

మడకశిరటౌన్: పట్టణంలోని 196వ పోలింగ్ బూత్ పరిధి సదాశివపురంలో ఏడు ఓట్లు మృతిచెందిన జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. భీమశంకర్, నరసింగ్, సౌభాగ్యమ్మ, రవికుమార్, అన్నపూర్ణ, గిరి, లక్ష్మమ్మ తదితరుల మృతుల ఓట్లు జాబితా నుంచి తొలగించలేదు. అగళి మండలంలో దొక్కలపల్లి గ్రామంలో మృతిచెందిన 30 ఓటర్ల వివరాలు ఉన్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి తెలిపారు.

ఆసరా కాదిది..

టోకరా..

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి

పెనుకొండ జనవరి 24: సీఎం జగన్మోహన్ రెడ్డి.. మహిళల సంక్షేమం పేరుతో గోరంత ఇచ్చి.. కొండంత దోచుకుంటున్నారనీ, డ్వాక్రా సంఘాలకు ఇచ్చింది ఆసరా కాదనీ, టోకరా అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. బుధవారం పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా కోటి మంది మహిళలు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున లబ్ధి చేకూర్చామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఒక్కో మహిళ పొందిన లబ్ధి రూ.15వేలు మాత్రమేనన్నారు. 50లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి టోకరా వేశారన్నారు. రాష్ట్రంలో 1.14 కోట్ల మంది డ్వాక్రా మహిళలు ఉంటే.. 79 లక్షల మందికే ఆసరా ఇచ్చారన్నారు. 35 లక్షల మందికి మొండి చేయి చూపారన్నారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి, నాసిరకం మద్యాన్ని ప్రజలకు అంటగట్టారన్నారు. కుటుంబ పోషణకు వినియోగించాల్సిన కష్టార్జితాన్ని మద్యం ద్వారా జగన్‌రెడ్డి దోచుకున్నాడన్నారు. నాసిరకం మద్యంతో 35 లక్షల మందిని అనారోగ్యం పాలుచేశాడనీ, 30 వేల మంది అకాల మృతికి కారకుయ్యాడని దుయ్యబట్టారు. నాసిరకం మద్యంతో మహిళల మాంగల్యాన్ని మంటగలుపుతున్నాడన్నారు. చిన్నమ్మ తాళి తెంచిన నరహంతకులను రక్షిస్తున్న జగన్‌రెడ్డి మహిళా ద్రోహికాదా అంటూ ప్రశ్నించారు. చెల్లికి ఆస్తిలో భాగం ఇవ్వని జగన్‌రెడ్డి మహిళా ద్రోహి కాదా అని విమర్శించారు. ప్రతి వస్తువుపై ధరలు పెంచి, ఒక్కో కుటుంబంపై 57 నెలల పాలనలో రూ.3లక్షల భారం మోపాడన్నారు. ఒకచేత్తో గోరంత ఇచ్చి.. రెండో చేత్తో కొండంత దోచేస్తున్నాడంటూ విమర్శించారు. చంద్రన్న పాలనలో సున్నా వడ్డీ రూ.5 లక్షలకు వర్తింపజేస్తే జగన్‌రెడ్డి రూ.3 లక్షలకు కుదించి, మోసం చేశాడన్నారు. ఆ మూడు లక్షలు కూడా సున్నావడ్డీ కింద కేంద్రమే భరిస్తుంది తప్ప.. జగన్‌రెడ్డి కాదన్నారు. చంద్రన్న అధికారంలోకి వచ్చి ఉండుంటే మొదటి ఏడాది నుంచి 3 వేల ఇళ్లు ఇచ్చి ఉండేవారన్నారు. పెళ్లి కానుక రద్దు చేసి జగన్‌రెడ్డి యువతులకు తీరని నష్టం చేశాడన్నారు. అంగనవాడీ జీతాలను చంద్రన్న రూ. 6300 పెంచగా.. జగన్‌రెడ్డి రూ.వెయ్యి పెంచి, చేతులు దులుపుకున్నాడన్నారు. టీడీపీ పాలనలోనే మహిళాభివృద్ధి జరిగింది తప్ప.. జగన్‌రెడ్డి హయాంలో ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సిద్దలింగప్ప, నరహరి, చిన్నప్పయ్య, రొద్దం నరసింహులు, అశ్వత్థనారాయణ, హుజూర్, జావీద్, వెంకటరమణ నాయక్, శంకర్, నాని, నంజుండ, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, రాము, ఆదినారాయణ, తోటగేరి శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీకే పార్థసారథి

రైతులకు విరివిగా రుణాలివ్వండి

బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

పుట్టపర్తి, జనవరి 24: జిల్లాలో రైతులకు విరివిగా రుణాలివ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు.. బ్యాంకర్లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్‌ఎల్‌బీసీ, డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణ వితరణ లక్ష్యం నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడంపై సమీక్షించామన్నారు. ఎకరా వరి పంటకు రూ.47వేలు, రాగికి రూ.22వేలు, వేరుశనగకు 36వేలు, అరటికి రూ.1.25 లక్షలు, బొప్పాయికి రూ.80 వేలు రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు బ్యాంకర్లు రుణాలు రైతులకు మంజూరు చేసి, వ్యవసాయాభివృద్ధికి కృషి తోడ్పడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన వారికి ఆయా బ్యాంకులు రుణాలు ఇవ్వాలనీ, యువ పారిశ్రామిక వేత్తల ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలన్నారు. రీసెట్ భవన నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించామనీ, సంబంధిత నివేదికలు సిద్ధం చేయాలని ఎల్‌డీఎం రమణకుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కొండయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, మేనేజర్ సురేఖారాణి, పశుసంవర్ధక జేడీ శుభదాసు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

పరిటాల రవీంద్రకు జన నివాళి


అభిమాన నాయకుడికి గజమాలతో నివాళి


పరిటాల ఘాట్ వద్ద కిక్కిరిసిన అభిమానులు


ఘాట్ వద్దకు వారసులు..


రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు

వెంకటాపురానికి వేలాదిగా వచ్చిన అభిమానులు


తండ్రి ఘాట్ వద్ద డాక్టర్ స్నేహలత నివాళి

మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్రకు వేలాది మంది అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ఆయన స్వగ్రామం వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి జనం పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి అభిమానులు విశేషంగా తరలివచ్చారు. పరిటాల రవీంద్ర సతీమణి, మాజీ మంత్రి పరిటాల సునీత, కుమారుడు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ, కూతురు స్నేహలత ఉదయమే ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. ఘాట్ వద్ద కూర్చుని.. ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సీనియర్ నాయకులు పెనుకొండ సవితమ్మ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.

\- రామగిరి



తాతయ్యకు పుష్పాంజలి


పరిటాల ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల ఉద్వేగం

ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళి


నివాళులు అర్పించిన టీడీపీ జిల్లా అధ్యక్షులు, నాయకులు


అభిమానులకు అన్నదానం


నిను మరువం..

ప్రజల గుండెల్లో పరిటాల రవి

మాజీ మంత్రి పరిటాల సునీత

పరిటాల రవి చనిపోయి 19 ఏళ్లు గడిచిందంటే నమ్మశక్యంగా లేదని, సేవా కార్యక్రమాలతో ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. భూమి ఉన్నంతవరకూ ఆయనను ప్రజలు మరిచిపోరని అన్నారు. ఎంతో మంది పుడతారు, చనిపోతారని, చరిత్ర కొంతమందిని మాత్రమే గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. అలాంటి వారిలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర పేర్లు ముందుంటాయని అన్నారు. పరిటాల రవి ఆశయాలను పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా కొనసాగిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ఆయన నిలబడ్డారని, అందుకే ఆయనను నేటికీ ప్రజలు మరచిపోలేదని అన్నారు. పరిటాల రవీంద్ర వర్ధంతిని పురస్కరించుకుని ఉమ్మడి రాష్ట్రంతోపాటు విదేశాలలోకూడా అభిమానులు సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. కొందరు ఆయన గురించి పిచ్చిగా మాట్లాడుతున్నారని, వారికి పరిటాల రవీంద్ర గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. అలాంటి మాటలతో ఆయన చరిష్మాను దెబ్బతీయలేరని అన్నారు.



పరిటాల రవి ఆత్మే మమ్మల్ని నడిపిస్తోంది

పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి



పరిటాల రవి స్ఫూర్తి, ఆయన ఆత్మే తమను ముందుకు నడిపిస్తోందని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా, ప్రజల హృదయాల్లో ఉండిపోయారని అన్నారు. సమాజ హితం కోసం పరిటాల రవి బతికారు కాబట్టే ఇన్ని రోజులు ఆయనను ప్రజలు గుర్తుపెట్టుకున్నారని అన్నారు. అలాంటి వ్యక్తికి కొడుకుగా పుట్టినందుకు గర్వంగా ఉందని అన్నారు. ఆయనను తలచుకుని ఏ కార్యక్రమం మొదలుపెట్టినా విజయవంతం అవుతుందని అన్నారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా ఏటా చాలాచోట్ల రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని, వారు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు రవిపై ఉన్న అభిమానాన్ని చాటుతోందని అన్నారు. రక్తదానంపై ఆయన జిల్లా ప్రజల్లో అవగాహన ఎంతగానో పెంచారని అన్నారు. తన తండ్రి చనిపోయిన తరువాత.. తమ వెన్నంటే ఉండి నడిపిస్తున్నవారందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



సూర్యప్రసాద్‌కు ప్రధానమంత్రి ప్రశంస

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకున్న రాగే సూర్యప్రసాద్‌ను పీఎం నరేంద్రమోదీ ప్రశంసించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి స్మృతి ఇరానీల చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాగే సూర్యప్రసాద్ బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. మోదీతో మాట్లాడిన అనంతరం గ్రూపు ఫొటో దిగారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు పొందడం గర్వకారణమని ఏపీఆర్ఎస్ గురుకుల ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.


ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పురస్కార గ్రహీత బాలలు

నియంత పాలనపై పోరాటం ఉధృతం చేయాలి

● బీవీ వెంకటరాముడుతో నారా లోకేశ్

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియంత పాలనపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారని ఆ పార్టీ రాయలసీమ జోన్-5 మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తెలిపారు. బుధవారం హైదరాబాదులో నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో బీవీ వెంకటరాముడు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ పలు విషయాలపై చర్చించారని, యువగళం పాదయాత్ర స్ఫూర్తితో ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తూనే టీడీపీ హామీలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారన్నారు. యువగళంలో రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా పాదయాత్ర విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించడంపై వెంకటరాముడును లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు.


లోకేశ్‌ను సత్కరిస్తున్న బీవీ వెంకటరాముడు

కదిరి వేరుశనగ రకాలు రాష్ట్రానికే తలమానికం: వీసీ


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

కదిరి, జనవరి 24: కదిరి వేరుశనగ రకాలు రాష్ట్రానికే తలమానికమని అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన వీసీ మాట్లాడుతూ.. దేశంలోనే కదిరి వేరుశనగ రకాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కదిరి-6, కదిరి-లేపాక్షి రకాలు దేశవ్యాప్తంగా 70శాతం వరకు సాగవుతున్నాయన్నారు. వీటికి అధిక దిగుబడినిచ్చే లక్షణాలు ఉన్నాయన్నారు. ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశోధనల కోసం వంద ఎకరాల భూమి అవసరమనీ, శాస్త్రవేత్తలు, సిబ్బంది కొరత ఉందని, మౌలిక వసతులు కల్పించాలని వీసీని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్లు వెంకటేశ్వర్లు, ప్రసన్న, రాజేష్, నీలిమ, వెంకటరమణ, వేమన, చంద్రనాయుడు పాల్గొన్నారు.

కారుణ్యం కరువయ్యింది..!


జడ్పీ కార్యాలయం



● జడ్పీలో ఊసేలేని కారుణ్య నియామకాలు ● రెండేళ్లుగా 140 మందికిపైగా ఎదురుచూపు

అనంతపురం విద్య, జనవరి 23 : కారుణ్యనియామకాల భర్తీపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తల్లిని కోల్పోయిన వారు కొందరు, తండ్రిని కోల్పోయిన వారు మరికొందరు. వారు భౌతికంగా లేకున్నా... కారుణ్య నియామకం కింద ఉద్యోగమైనా వస్తే తమ జీవితాలకు ఆసరాగా ఉంటుందని వందలాది మంది నిరుద్యోగులు రెండు, మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. మరికొందరు ఏఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. జడ్పీలో కొంత కాలంగా ప్రమోషన్లు, నియామకాలు ఆగిపోవడంతో... ఆశావహులకు దిక్కు తోచడంలేదు. దీనికితోడు త్వరలో ఎన్నికలు వస్తే.. మరింత జాప్యం తప్పేలా లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

140 మంది వరకూ....

జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ పరిధిలోని జడ్పీ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయాలు, జడ్పీ స్కూళ్లలో కారుణ్య నియామకాలు గత కొంత కాలంగా ఆగిపోయాయి. అనారోగ్యం, ప్రమాదాలు, కరోనా, ఇతర కారణాలతో అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరణించారు. 2019, 2020, 2021 సంవత్సరాల నుంచి సుమారు 140 మంది వరకూ ఉద్యోగుల సంతానం కారుణ్య నియామకాలు ఎప్పుడు చేపడ్తారో అంటూ జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది కిందట కారుణ్య నియామకాల కింద భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ.... అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తించారు. అయితే ఇప్పటి వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు.

ప్రమోషన్లూ అంతంతే...

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గుమ్మగట్ట, తాడిమర్రి, జడ్పీకార్యాలయం, వజ్రకరూరు, తదితర ప్రాంతాలతోపాటు, మరికొన్ని చోట్ల ఏఓ పోస్టులు ఖాళీలున్నాయి. ఈ క్రమంలో సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ప్రమోషన్లు ఇస్తే.... జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రమోషన్ల ప్యానల్ కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఐదారు నెలలుగా పాలకవర్గం, అధికారుల మధ్య ఆధిపత్యపోరు కారణంగా నియామకాలు, ప్రమోషన్ల ఫైళ్లు పట్టాలెక్కలేదు. జడ్పీ సీఈఓగా ఐఏఎస్ అధికారి నియామకంతోనైనా నియామకాలు చేపడ్తారని అభ్యర్థులు ఆశిస్తున్నారు. ఎన్నికల లోపు భర్తీ చేపట్టాలని నిరుద్యోగులు, ప్రమోషన్ల ఆశావహ అధికారులు కోరుతున్నారు.

28న జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల హాకీ ఎంపిక పోటీలు ఈనెల 28వతేదీన అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అనంతపురం కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. 2005 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు జూనియర్ కేటగిరీకి, 2008 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు సబ్‌జూనియర్ కేటగిరీకి అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, పదోతరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన జూనియర్ బాలికల హాకీ జట్టు ఫిబ్రవరి 9వతేదీ నుంచి 11వతేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే 14వ రాష్ట్ర జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు సబ్ జూనియర్ బాలుర జట్టు ఫిబ్రవరి 10వతేదీ నుంచి కర్నూలులో జరిగే 13వ రాష్ట్ర సబ్‌జూనియర్ బాలుర హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9490033474ను సంప్రదించాలని కోరారు.

వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 24 : వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. వీరారెడ్డి 19వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా వివిధ రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి వీరారెడ్డి అని కొనియాడారు. అనేక పోరాటాల్లో రాటుదేలిన వీరారెడ్డి చనిపోయి 19 సంవత్సరాలైనప్పటికీ ఆయన స్ఫూర్తిని నెమరువేసుకుంటూ నేటి సీపీఎం నాయకత్వం జిల్లాలో పెద్దఎత్తున రైతు, కార్మిక పోరాటాలతో ఆందోళనలను కొనసాగిస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటనారాయణ, నాగమణి, సురేష్, వన్నూరప్ప, శివ, హరీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సమ్మె దిశగా డీఆర్‌డీఏ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగులు ఇప్పటికే సమావేశం నిర్వహించి, సమ్మెపై చర్చించాల్సి ఉండేది. కానీ సీఎం పర్యటన నేపథ్యంలో వాయిదా వేసుకున్నారు. నగరంలోని రైతు బజారులో బుధవారం డీఆర్‌డీఏ-వైకేపి ఉద్యోగుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమ్మెలోకి వెళ్లాలని ఏపీడీ మొదలు డీపీఎంలు, ఏసీ, ఏపీఎంలు, సీసీల వరకు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో 600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో సుమారు 90 శాతం మంది సమ్మెకు మొగ్గుచూపుతున్నారు.

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్‌డీఏ-వైకేపీ సమ్మెబాట పట్టారు. గురువారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఉద్యోగులు సమావేశమై, సమ్మెలోకి వెళ్తున్నట్లు తీర్మానించారు. అనంతరం సమ్మె నోటీసును డీఆర్‌డీఏ పీడీ నరసయ్యకు అందించారు. ఫిబవరి 3వ తేదీ వరకు సమ్మె చేస్తామని ఆ ఉద్యోగుల జిల్లా జేఏసీ కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామమోహన్, నారాయణ, శంకర్, సుధాకర్, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

● సెబ్ అధికారుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 24: ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని, మద్యం, నగదు, బంగారు నగలు అక్రమంగా తరలించకుండా నిఘా వేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సెబ్ అధికారులను ఆదేశించారు. బదిలీల్లో భాగంగా సెబ్ విభాగంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్పీ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి జిల్లాలోకి మద్యం తరలించకుండా అడ్డుకోవాలన్నారు. సారా ఊటలను ధ్వంసం చేయాలన్నారు. సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

'మీన్స్' వివరాలు నమోదు చేయండి: ఏసీ

అనంతపురం విద్య, జనవరి 24 : గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలను ఈ నెల 31వ తేదీలోగా నమోదు చేయాలని ఏసీ గోవింద్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర్వాత ఎలాంటి పొడిగింపు ఉండదని విద్యార్థులు ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, విద్యార్థి తండ్రి పేరు, మెరిట్ కార్డ్‌పైన ముద్రించిన విధంగా ఆధార్‌పైన ఉన్న వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఒకవేళ ఆధార్ వివరాలు... మెరిట్ కార్డుతో సరిపోకపోతే ఆధార్ మిస్ మ్యాచ్ వివరాలను వెంటనే డీఈఓ కార్యాలయంలో సంప్రదించి ఈనెల 27వ తేదీలోగా అందజేయాలన్నారు. విద్యార్థి అందజేసిన చేసిన దరఖాస్తులను సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్ స్థాయిలో ఫిబ్రవరి 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారి ధ్రువీకరించాలన్నారు. 2019, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లు, కళాశాలల్లోని విద్యార్థులు ఈ ఏడాది తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.28వేలు

అనంతపురం రూరల్, జనవరి 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.28వేలు, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 16 టన్నులు వచ్చాయన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పరిటాల రవీంద్ర ఆశయాలను కొనసాగిద్దాం

● టీడీపీ నాయకుల పిలుపు ● వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



పరిటాల రవి, ఎన్టీఆర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 24: పరిటాల రవీంద్ర ఆశయాల ను కొనసాగిద్దామని పట్టణం లోని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. 19వ వర్ధంతి సం దర్భంగా స్థానిక పార్టీ కార్యాల యంలో బుధవారం వారు పరిటాల రవి చిత్రపటంతో పాటు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పరిటాల రవీంద్ర బడుగుల అభ్యున్నతికి విశేష కృషి చేశారని, మంత్రిగా ఉమ్మడి రాష్ట్రానికి అనేక సేవలందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. తర్వాత ప్రభుత్వా స్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అలాగే అన్న క్యాంటీన్, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వాస్పత్రి, శ్రీలక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్, కదిరిగేటు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, ఫణికుమార్, మద్దిలేటి, పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్ హుస్సేన్, పఠాన్‌బాబూఖాన్, అంబటిసనత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిటాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

కదిరి: పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో పరిటాల చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.



ఆర్డీటీ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి: పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ శ్రేణులు.. ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి, నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీటీ ఆసుపత్రి వద్దకు చేరుకున్నాంనను. రోగుల బంధువులకు అన్న దానం చేశారు. ఆర్డీటీ ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయ కులు చల్లా శ్రీనివాసులు, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఘంటాపురం జగ్గు, తాళ్లూరి సతీష్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలకేంద్రంలో టీడీపీ శ్రేణులు పరిటాల రవీంద్ర వర్ధంతిని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత నారసింపల్లి గ్రామంలోని వృద్ధాశ్ర మంలో వృద్ధులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జనార్దన్ , టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్, నాయకులు సాయి,రామానాయుడు, రవీంద్రారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.



పరిటాల చిత్రపటం వద్ద తమ్ముళ్ల నివాళి



నాలుగురోడ్ల కూడలిలో పరిటాల చిత్రపటం వద్ద నివాళి

కొత్తచెరువు: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిటాల రవీంద్ర వర్ధంతిని స్థానిక టీడీపీ శ్రేణులు నిర్వ హించారు. ఈ సందర్భంగా చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజలకు చేసిన సేవ లను కొనియాడారు. నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, అడపాల రామకృష్ణ, ఒలిపిశీన, లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లిరాజు, గాజుల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో ని బస్‌షెల్టర్‌లో పరిటాల రవీంద్ర వర్ధంతి, టీడీపీ నాయకులు జరిపారు. ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్ర మంలో నాయకులు రమేష్ బాబు, క రణం ప్రభాకర్, కనుమ చంద్ర, సూ ర్యశేఖర్ రాజు, మహబుబ్‌పీరా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పరిటాల రవీంద్ర చిత్రపటం వద్ద నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు

నంబులపూలకుంట: మండలకేం ద్రంలోని నాగలకట్ట సమీపంలో పరి టాల రవీంద్ర వర్ధంతిని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నా యుడు, ప్రధాన కార్యదర్శి నరసిం హులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అంజనప్పనాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరాములునాయుడు తదితరులు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలకేంద్రంలోని టీ డీపీ కార్యాలయంలో పరిటాల రవి వర్ధం తిని టీడీపీ నాయకులు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో మం డల కన్వీనర్ కొండయ్య, మాజీ సర్పంచ్ ప్రసాద్, అక్ర మ్‌బాషా, యూనిస్‌ఖాన్, మునాఫ్, రమేష్, నరసింహులు, ఆంజనే యులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిటాల చిత్రపటం వద్ద నివాళులు

పరిటాల రవీంద్ర వర్ధంతికి తరలిన నాయకులు





పరిటాలరవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న చిగిచెర్ల ఓబిరెడ్డి, ఘంటాపురం జగ్గు తదితరులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతికి పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. రామగిరి మండలం వెంకటాపురానికి వెళ్లి అక్కడి పరిటాల ఘాట్‌ను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొద్దుతిరుగుడు పంట పరిశీలన

నల్లమాడ, జనవరి 24: మండలంలోని రెడ్డిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని నేరాల వంకతండాలో పొద్దుతిరుగుడు పంటను ఏడీఏ సత్యనారాయణ బుధవారం పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పంట గింజ దశలో ఉందన్నారు. గింజలో నూనె శాతం పెరగడానికి రైతులు గంధకం ఎరువులు వాడాలని సూ చించారు. మెట్రోసిమ్, ఆల్టారీయా, ఆకు మచ్చలు, బూడిద తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట ఏఈఓ సుమతి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఉన్నారు.



పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తునన ఏడీఏ తదితరులు

ఇచ్చింది గోరంత.. చెప్పేది కొండంత

● ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు టోకరా

● వైసీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి పల్లె మండిపాటు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి, జనవరి 24: డ్వాక్రా సంఘాలకు గోరంత ఇచ్చి.. కొండంత ఇచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్ రెడ్డి గొప్పలు చెబుకుం టున్నారని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాల యంలో బుధవారం ఆయన వి లేకరులతో మాట్లాడారు. డ్వా క్రా మహిళలకు వైసీపీ ప్రభు త్వం ఇస్తున్నది ఆసరా కాదని, టోకరా అని మండిపడ్డారు. టీడీపీ పాలనలో డ్వాక్రా మహిళ లకు రుణమాఫీ, పసుపుకుంకుమ ద్వారా కోటి మందికి లబ్ధి చేకూర్చామన్నారు. అదే వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో కోటి 14లక్షలమంది డ్వాక్రా మహిళలు ఉంటే, కేవలం 79లక్ష మందికి ఆసరా కుదించి, 35లక్షలమందికి మొండిచేయి చూపా రని అన్నారు. మద్యం ధరలు మూడురెట్లు పెంచి ఎన్నో కుటుంబాలను వీధి పాలు చేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు. తన 57నెలల పాలనలో సీఎం జగన్ ఒక్కొక్క కుటుంబంపై రూ.మూడుల క్షల భారం మోపారన్నారు.. ఉచిత ఇళ్ల అంటూ ఓటీఎస్ పేరుతో ఒక్కొక్క మహిళ నుంచి రూ.10 వేల నుంచి రూ. 30వేల వరకు వసూలు చేశారని ఆయన పేర్కొన్నారు.

డ్వాక్రా మహిళలకు సీఎం టోకరా : కందికుంట

కదిరి: డ్వాక్రా మహిళలకు సీఎం జగన్ ఇస్తున్నది ఆసరా కాదని.. టో కరా అని టీడీపీ ని యోజకవర్గ ఇన్‌చార్జి కంది కుంట వెంకటప్రసాద్ ఒక ప్ర కటనలో విమర్శించారు. చం ద్రబాబు పాలనలో రుణమాఫీ, పసుపుకుంకుమ ద్వారా కోటి మంది మహిళలు ఒక్కొక్కరు రూ.20వేల చొప్పున లబ్ధి పొందా రన్నారు. అదే జగన్‌రెడ్డి పాలనలో ఆ ఆదాయం రూ.15వేలకు తగ్గిపోయిందన్నారు. రాష్ట్రంలో 1.14 కోటి మంది డ్వాక్రా మహి ళలుంటే వారిని 79లక్షలకు కుదించారన్నారు. ఇక మద్యం రేట్లు పెంచి సామాన్యులు, పేదల కుటుంబాలను నాశనం చేశారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి గోరంత ఇచ్చి కొండంత దోచేరని తెలిపారు. సున్నావడ్డీపేరుతో మోసం చేశారన్నారు. పేదల కు టిడ్కోఇల్లు ఇవ్వకుండా మోసం చేశా రని తెలిపారు. పెళ్లికానుకల రద్దు వలన పేదింటి ఆడపిల్లలు నష్టపోయారన్నారు. రాష్ట్రంలో అత్యాచారాలు, మహిళలపై వేధింపులు పెరిగిపోయాయన్నారు. మహిళలను ఉద్ధరించా మని జగన్ చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందని ఆయన దుయ్యబట్టారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

పుట్టపర్తి, జనవరి 24: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివా రణకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయా లని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రవాణా, పోలీస్, వైద్యం, మున్సిపల్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహ దారుల శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై సమావేశం నిర్వహించారు. తొలుత గత 11 మాసాల్లో ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు సమ న్వయంతో పని చేసి.. భద్రతా లోపాలు గుర్తించాలని, నివార ణకు ప్రణాళికలు తయారుచేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు ప్రమాదాల నివార ణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీటీసీ కరుణాసాగర్‌రెడ్డి, డీఎం హెచ్ ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఎంవీఐలు వరప్రసాద్, శివశంకర్, డీపీ టీఓ మధుసూదన్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

'ప్రజలకు మెరుగైన సేవలు అందించండి'

పుట్టపర్తిరూరల్, జనవరి 24: ప్రజలకు మెరుగైన సేవలందించి.. పోలీసులపై నమ్మకం పెంచాలని ఎస్ఐ శిక్ష ణ పూర్తి చేసుకున్న ఏఎస్ఐలకు ఎస్పీ మాధవరెడ్డి సూచిం చారు. పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో బుధవా రం 1990వ బ్యాచ్‌కు చెందిన 17 మంది ఏఎస్ఐలు 45 రోజుల ఎస్ఐ శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి కావడంతో వా రంతా ఎస్పీని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసు వృత్తి అత్యంత బాధ్యతాయుతమైందన్నారు. సమాజంలోని ప్రజ లకు మెరుగైన సేవలందించి పోలీసులపై నమ్మకం పెంచా లన్నారు. ఉద్యోగం శాశ్వతం కాదని, మనం అందించే సేవలే శాశ్వతమని పేర్కొన్నారు. అనంతరం వారు మర్యాదపూర్వ కంగా ఏఎస్పీ విష్ణును కలిశారు. కార్యక్రమంలో పోలీసు అధి కారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకేత్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సూర్యకుమార్, హరినాథ్, ఆనంద్, తేజ్‌పాల్ పాల్గొన్నారు.



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎస్ఐలు

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

నంబులపూలకుంట, జనవరి 24: ఉపాధి పథ కంలో పండ్లతోటల పెంపకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. 2024-25వ ఆర్థిక సంవత్సరానికి జాబ్ కార్డు కలిగి ఉండి, ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు అర్హులన్నారు. చిన్న, సన్నకారు సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పుస్తకం జత చేసి ఫీల్డ్ అసిస్టెంటు ద్వారా దరఖాస్తు పూర్తి చేసి ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలన్నారు. ఈ అవకాశాన్ని సన్న చిన్నకారు రైతులు వినియోగించుకో వాలని సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

అమడగూరు, జనవరి 24: జనసేన పార్టీ మండల కన్వీనర్ వలసపల్లి ఆంజనేయులుతో పాటు ఆయన భార్య లక్ష్మీభార్గవి, కుమారుడు జితేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదా నికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. కాగా ఆంజనేయులుతో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ బుధవారం ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థి తిపై ఆరా తీశారు. అనంతరం రూ.25వేలు ఆర్థికసాయాన్ని నాయకుడు డాక్టర్ బాబు చేతులమీదుగా అందించారు. ఆంజనేయుల కుటుంబానికి మెరుగైన వైద్యం అందించా లని వైద్యులకు సూచించారు.

మండల సమావేశం...

నంబులపూలకుంట, జనవరి 24: మండలకేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఇందులో ఎంపీపీ రాము అధ్యక్షతన ఎంపీడీఓ ఆదినారాయణ అజెండాను చదివి వినిపించారు. ఆయాశాఖల అధికారులు జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అలాగే పలువురు ప్రజాప్ర తినిధులు వివిధ సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకొ చ్చారు. సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వరెడ్డి మాట్లా డుతూ.. కదిరి, రాయచోటి రోడ్డును కనీస మరమ్మతులు చేయాలని కోరారు. దీనివల్ల వాహనదారులకు, ప్రయాణి కులకు కొంతవరకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. కార్య క్రమంలో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి రెడ్డి, తహసీల్దార్ నరేంద్ర కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి, జనవరి 24: వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చా లని వాల్మీకి బోయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు కృష్ణ మూర్తి డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలోని ఆలూరులో జరుగుతున్న వాల్మీకి బోయల ఆత్మగౌరవ రిలేనిరాహార దీక్షకు బుధవారం ఆయన హాజరయ్యారు. ఈసందర్భం గా మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చే వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సామాజి కంగా వెనుకబడిన తమకు ఎస్టీ హోదా కల్పించాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో బోయసంఘం నాయకులు ఆనంద్, ధనుంజయ , వీరనారప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ క్లస్టర్ల సమావేశం

పుట్టపర్తి, జనవరి 24: టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్ చార్జిలతో పాటు బూత్ కన్వీనర్లకు సమావేశాన్ని పట్టణం లోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించను న్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పుట్టపర్తి, బుక్క పట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన కమిటీల సభ్యు లు ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు. అలాగే మధ్యాహ్నం 3గంటలకు ఓడీసీ మండకేంద్రంలోని ఐటీఐ కళాశాలలో జరిగే సమావేశానికి ఓడీసీ, నల్లమాడ, అమడ గూరు మండలాలకు చెందిన రావాలని సూచించారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

పుట్టపర్తి, జనవరి 24: జిల్లాలో గురువారం ఓటరు దినోత్సవాన్ని జరుపుతున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎను ములపల్లి ఉన్నతపాఠశాలలో గురువారం ఉదయం 10:30 గంటలకు ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అధి కారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

'బాలికా విద్యతోనే నవసమాజ స్థాపన'



కొక్కంటిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

తనకల్లు, జనవరి 24: నవ సమాజ స్థాపన బాలికావిద్యతోనే సాధ్యమవుతుందని నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గంగ రత్న అన్నారు. మండలంలోని కొక్కంటిలో బుధవారం ఎంపీపీ కౌసల్య అధ్యక్షతన అంత ర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద మానవహారంగా ఏర్పడి ఆడబిడ్డను రక్షిద్దాం, ఆడబిడ్డను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన సమావే శంలో సీడీపీఓ మాట్లాడుతూ.. నవసమాజ ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి రక్షణకు సమాజం కృషి చేయా ల్సిన అవసరముందన్నారు. ఆడపిల్లలు , మహిళలు కష్టం కలిగితే 108, 100కు సమాచారం అందించాలని సూచిం చారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ బాలికావి ద్యను ప్రోత్సహించడానికి త మవంతుగా సహకారం అంది స్తానన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, హెచ్ ఎం సుభానుల్లా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, అంగన్‌వా డీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని పట్నం జిల్లాపరిషత్ పాఠ శాలలో జాతీయ బాలికాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈకార్యక్రమం 1098 చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మౌలాది, రామలక్ష్మి, ప్రభావతి పాల్గొని మాట్లాడారు. బాలికల హక్కులు, బాధ్యతలు, సమాజంలో ఎలా మసులు కోవాలో అవగాహన కల్పించారు. ఆడపిల్లలు బాగా చదువుకున్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొ న్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

బుక్కపట్నం: బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ గాయత్రి సూచించారు. జాతీయ బాలి కల దినోత్సవం సందర్భంగా మండలంలోని బుచ్చయ్యగారి పల్లి కేజీబీవీలో బాలికలకు బేటీబచావో.. బేటీ పడావో కార్య క్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బాలికలు చదవుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరో హించాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీబీవీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో ఎంఈఓలు తదితరులు

ధర్మవరం, జనవరి 24: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించా లని ఎంఈఓ-1రాజేశ్వరి, ఎం ఈఓ-2 గోపాల్‌నాయక్ సూ చించారు. పట్టణంలోని ప్ర భుత్వ బాలుర ఉన్నత పాఠ శాలలో బుధవారం రిపబ్లిక్ డే సందర్భంగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆత్మీయట్రస్టు సహకారంతో అండర్-14 ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను జరిపారు. వీటిని ఎంఈఓలతో పాటు బాస్కెట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రె టరీ శెట్టిపి జయచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లా డుతూ... విద్యార్థులు చదువుతోపాటు ప్రాథమిక స్థాయినుంచి క్రీడల్లోనూ రాణించాల న్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. మానసిక ఉల్లాసం కలుగు తుందన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి 12 జట్లు పాల్గొంటున్నట్టు అసోసియేషన్ పటణా ధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, సెక్రెటరీ హిదయ్‌తుల్లా తెలిపారు. లీగ్ కం నాకౌట్ పద్ధ తిలో జరిగే ఈ టోర్నీ ఫైనల్ ఈనెల 26వతేదీ సాయంత్రం ఉంటుందన్నారు. కార్యక్ర మంలో పీడీ నాగేంద్ర, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

కన్నులపండువగా గోదారంగనాథస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం, జనవరి 24: పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో బుధవారం గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని అర్చ కులు కన్నుల పండువగా నిర్వహించారు. తొ లుత స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహా లను వివిధ రకాల పూలతో, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం వేదమంత్రోచ్చారణల నడుమ కల్యా ణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహా మంగహారతి ఇచ్చి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేపట్టారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను ఆల పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీసభ్యులు తబ్జులు శ్రీనివాసులు, నీలమయ్య, వాసవి మహిళా మండలిసభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా షర్ఫొద్దీన్ ఉరుసు

కదిరి, జనవరి 24: తలుపుల మండలకేంద్రంలోని బాబా షర్ఫొద్దీన్ ఉరుసు మూడు రోజుల పాటు జరగనుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. కులమతాలకతీతంగా ఉరుసు జరుగుతుందన్నారు. కుమ్మరపేటలోగు రువారం రాత్రి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన అశోక్‌కుమార్ ఇంటినుంచి గంధం తీసుకొస్తా రని, దీంతో ఉరుసు ప్రారంభమవుతుందని అన్నారు. రెండోరోజు శుక్రవారం మండలంలోని నూతన కాలువనుంచి గంధం తీసుకొస్తారన్నారు. ఈ రెండురోజులపాటు ఖవ్వాలీ ఉంటుం దన్నారు. మూడోరోజు శనివారం హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు. హిందూముస్లింలు కలిసి మెలిసి ఈ ఉరుసును జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఉరుసుకు గట్టి బందో బస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు. బాబా షర్ఫొదీన్ దర్గాకు ఉరుసు సందర్భంగా టీడీపీ నాయకుడు వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి రూ.30వేలు విరాళాన్ని అందజేశారు. దర్గా కమిటీ సభ్యులకు నగదును అందించారు.

రోడ్లను బాగుచేస్తారా.. నన్ను బాగు చేయించమంటారా!



ఆర్థికసాయం అందిస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ముదిగుబ్బ/ అనంతపురం సెంట్రల్, జనవరి 24: ధర్మవరం పట్టణంలో రోడ్లు అధ్వానం గా ఉన్నాయి.. అధికారులు వాటిని బాగు చేస్తారా.. లేక తననే బాగు చేయమంటారా అని మాజీ ఎమ్మెల్యే గోను గుంట్ల సూర్యనా రాయణ సంబంధితాధికారులను నిల దీశారు.. ముదిగుబ్బ మండలం పూజారితండాకు చెం దిన రాంచంద్రనాయక్ అనారో గ్యంతో అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గోనుగుంట్ల బుధవారం ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మవరంలోని రోడ్లు గుంతలమయం కావడంతో అక్కడి ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కేతిరెడ్డి తట్టెడు మట్టివేయించిన పాపాన పోలేదన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందించడం లేదన్నారు. ఆ రోడ్లను మరమ్మతు చేయించకుంటే.. తానే సొంతఖర్చులతో బాగు చేస్తానని చెప్పారు. ఎస్ఈని కలిసి వారం రోజుల్లోపు పనులు మొదలు పెట్టాలని చెప్పామన్నారు. ధర్మవరం చెరువులో 100ఎకరాలు కబ్జాకు గురవుతుంటే తాము అడ్డుకున్నామని ఈ సందర్భంగా పేర్కొ న్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆయన వెంట నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

కదిరిఅర్బన్, జనవరి 24: రోడ్డు నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరి కట్టాలని ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత డ్రైవర్లకు, వాహనదారులకు సూచించారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వారు పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కాలేజీ సర్కిల్‌నుంచి పలు వాహనాలతో వారు అంబేద్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీ కొనసాగించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణలో డ్రైవర్లే కీలకమన్నారు. రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు

కదిరిఅర్బన్, జనవరి 24: రిపబ్లిక్ డే సందర్భంగా ఈనెల 26వ తేదీన పట్టు గూళ్ల మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెటింగ్ అధికారి చంద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టు రైతులు, రీలర్లు ఈవిషయాన్ని గమనించి సహకరిం చాలని కోరారు.

రథయాత్ర పోస్టర్ల విడుదల

అమడగూరు, జనవరి 24: మండలంలోని కొట్టువారిపల్లిలో బుధవారం ఆల్‌ఇం డియా బంజారా సేవా సంఘం వారు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ రథయాత్ర పోస్ట ర్లను విడుదల చేశారు. సంఘం మండలాధ్యక్షుడు రమణా నాయక్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన అనంతపురం జిల్లాకేంద్రంలో సేవాలాల్ రథయాత్ర జరుగుతుంద న్నారు. కార్యక్రమానికి బంజారాలందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్‌నాయక్, రత్నాబాయి, రమేష్‌నాయక్, సురేష్‌నాయక్, పొట్టి శ్రీరాముల నాయక్, శంకర్‌నాయక్, నాగరాజునాయక్ పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

పుట్టపర్తి, జనవరి 24: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్ల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను డీపీటీఓ మధుసూ దన్ శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి కష్టమైనది డ్రైవింగ్ అన్నారు. డ్రైవర్లు అకింత భావంతో విధులు నిర్వహిస్తుండడం వల్లనే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నా రని తెలిపారు. వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎం ఇనయ తుల్లా, ఎంసీ విజాయనంద్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ఓబుళదేవరచెరువు, జనవరి 24: మండలంలోని డబురువారిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు షామీర్.. విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎన్టీఆర్ అభిమాని హర్షన్ సహకారంతో విద్యార్థులకు పలకలు, అట్టలు, నోటు పుస్తకాల పంపిణీ చేసినట్లు షామీర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

పుట్టపర్తి, జనవరి 24: వికసిత్ భారత్ సంకల్పయాత్రను మండలంలోని కోట్లప ల్లిలో బుధవారం నిర్వహించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బీజేపీ జిల్లా ఉపాధ్య క్షుడు రత్నాకరం కొండమరాజు ప్రజలకు వివరించారు. పథకాలను అర్హులు విని యోగించుకోవాలని సూచించారు. ఏఓ వీర బ్రహ్మం, నోడల్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ ఆర్డీ అశోక్‌కుమార్, సీహెచ్‌ఓ నగేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో జేసీ సమావేశం



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం, జనవరి 24: ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తరువాత పలు రాజకీయ పార్టీల నాయకులతో హిందూపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమావేశమయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ బుధవారం రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఆయన మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గంలో హిందూపురం పట్టణంలో 1,26,841ఓట్లు ఉండగా రూరల్ మండలంలో 42,138, లేపాక్షి 35,637, చిలమత్తూరులో 41,847ఓట్లు ఉన్నాయన్నారు. ఇందులో 1,22,471 మహిళల ఓటర్లు ఉండగా పురుషులు 1,23,974 ఓటర్లు ఉన్నాయన్నారు. ఇతరులు 18మంది ఉన్నారన్నారు. ఎవరికైనా ఓటరు జాబితాలో పేరు లేకపోతే సరిచూసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల నాయకులకు అందించామన్నారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలవద్ద సౌకర్యాలు కల్పించాలని గుర్తిస్తే చెప్పవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ స్వర్ణలత, నాగరాజు, ఎంపీడీఓ నరేంద్ర, సిరికల్చర్ ఏడీ సురేష్, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఘననివాళి



అశ్వత్థప్ప మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, జనవరి 24: మండలంలోని కోనాపురంలో టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ నారాయణ స్వామి తండ్రి దారపునేని అశ్వత్థప్ప(85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, కార్యనిర్వాహక కార్యదర్శి సవిత వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కన్వీనర్ రవిశంకర్, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, అశ్వత్థనారాయణ, హజురుల్లాఖాన్, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, శివశంకర్, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మాధవనాయుడు, త్రివేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండ.. టీడీపీ: గుండుమల



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, జనవరి 24: కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని క్యాంపురం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు వెంకట రమణప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తిప్పేస్వామి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి వెంకటరమణప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రఘురాం, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కరియన్న, రాజు పాల్గొన్నారు.

'బీసీలకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది.. టీడీపీనే'

మడకశిరటౌన్, జనవరి 24: బీసీలను రాజకీయంగా ఆర్థికంగా అన్నిరకాలుగా అభివృద్ధికి తోడ్పాటు అందించిన పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీలు కలిసి పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో టీడీపీ ముఖ్య నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఠాకూర్‌కు భారతరత్న రావడం హర్షణీయం: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరిఠాకూర్‌కు అత్యున్నత భారతరత్న పురస్కారం రావడం హర్షించదగ్గ విషయమని గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఠాకూర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయీ బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రవికుమార్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

సౌర విద్యుదుత్పత్తిలో పావగడకు మొదటి స్థానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, జనవరి 24: పావగడ ప్రాంతంలో వివిధ కంపెనీల నుంచి 22 వేల ఎకరాల్లో ఉత్పాదన చేస్తున్న సోలార్ విద్యుత్ ఆసియా ఖండంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అన్నారు. బుధవారం రాప్టె, నాగలమడక గ్రామ పంచాయతీలలో నిర్వహించిన జనస్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఆయన మాట్లాడారు. ఒకప్పుడు పావగడ అంటే కరవు ప్రాంతంగా ఉండేదని, సోలార్ నిర్మాణం ద్వారా ఆసియా ఖండంలో మొదటి స్థానంగా గుర్తించడం గర్వించదగ్గ విషయం అన్నారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరామ్, సీడీపీఓ సునీత, బీఈఓ ఇంద్రాణి, సీడీపీఓ సునీత, పీడీఓ రంగధామప్ప పాల్గొన్నారు.


బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయండి

గోరంట్ల, జనవరి 24: బాలికల సంక్షేమం కోసం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒకరు కృషి చేయాలని సీడీపీఓ అనురాధ పిలుపునిచ్చారు. మండలంలోని బూదిలి ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏసీడీపీఓ గీతా, ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రజిత, మహిళ కార్యదర్శి పర్వీన్‌భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పీసీసీ మాజీ అధ్యక్షుడి రాక

హిందూపురం అర్బన్, జనవరి 24: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ రానున్నట్లు ఆ పార్టీ నాయకుడు బాలాజీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న ప్రస్తుత పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమావేశం గురించి విషయాలు తెలియజేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

మహిళ ఆత్మహత్య



రాధ (ఫైల్)

హిందూపురం, జనవరి 24: మండలంలోని వీవర్స్‌కాలనీకి చెందిన రాధ(42)అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఆజాద్ తెలిపారు. కొంతకాలంగా భర్త కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడని, అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయని దీనికి తోడు మహిళా సంఘాల్లో కూడా తీసుకున్న రుణం కట్టకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనైంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో పైకప్పునకు ఉరివేసుకుంది. బుధవారం ఉదయం ఎంతసేపటికి లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తీసి చూసేసరికి ఉరికి వేలాడుతోంది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు మోదుచేసి ఆత్మహత్యకు గల కారణాలను ఆరాతీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా..!

- నకిలీ పట్టాలతో అక్రమ నిర్మాణాలు
- శ్మశానవాటిక, ఆర్‌అండ్‌బీ స్థలాలూ వదలని వైనం
- 24మంది పట్టాల కోసం రూ.24లక్షలతో ఒప్పందం?
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, జనవరి 24: ఎన్నికలు సమీపిస్తుండటంతో దొరికినకాడికి దోచుకోవాలన్న ధనదాహంతో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. లక్షలు విలువచేసే విలువైన స్థలాలను పథకం ప్రకారం బినామీ పేర్లతో పట్టాలు చేయించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు అధికార పార్టీ నాయకులు. అంతేకాక అధికారుల సంతకాలు సృష్టించి నకిలీ పత్రాలతో నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డు చెప్పిన అధికారులను తమదైన శైలిలో పైస్థాయి నాయకులతో ఒత్తిడి తెచ్చి అధికారుల నోరు మూయిస్తున్నారు. ఈ తతంగం డివిజన్ కేంద్రమైన పెనుకొండ పట్టణంలో చోటుచేసుకుంటోంది.

సబ్ కలెక్టర్ భవనం ఎదురుగా అక్రమ నిర్మాణం


పెనుకొండ పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సబ్‌కలెక్టర్ నివాసం వద్దనున్న బంగ్లాకు వంద అడుగుల దూరంలో నకిలీ పట్టాలతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారుల సంతకాలతో పట్టాలు సృష్టించి నిర్మాణ పనులు చేస్తున్నారు. హెచ్ ఎస్ఆర్. డీఐఎస్. నంబరు 36/1438/బీ 2020 ఆగస్టు 21న పట్టా మంజూరు చేశారని నకిలీ పట్టా సృష్టించారు. ఆ పట్టాకూడా ట్రూకాపీ కింద పట్టా తీసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శంకర్ సంతకంతో ఫోర్జరీ చేశారు. ఈ డీటీ ప్రస్తుతం సోమందేపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



నాయకులు సృష్టించిన నకిలీపట్టా

శ్మశానాన్నీ వదలని నాయకులు

అర్హులైన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ జగనన్న లేఅవుట్‌లో ఉన్న శ్మశానవాటికను సైతం వదలని అధికార పార్టీ నాయకులు ఈ లేఅవుట్‌లో 29.14ఎకరాల్లో 1006మందికి ఆన్‌లైన్ పద్ధతితో పట్టాలు మంజూరు చేశారు. ప్రజా అవసరాల కోసం 3ఎకరాలు, 1.30 ఎకరాల్లో శ్మశానవాటిక ఉంది. ఇప్పటికే అనుకూలమైన వారికి ఈ స్థలంలో పట్టాలు ఇచ్చారని నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ లేఅవుట్‌లో నిబంధనల మేరకు ఆన్‌లైన్ పద్ధతిలో పట్టాలు మంజూరు చేయాలి. అయితే అధికారులు ప్రజా అవసరాల కోసం వదిలిన ఖాళీ స్థలంలో మాన్యువల్ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేస్తున్నారు. ఈ లేఅవుట్ స్థలంలో ఉన్న పురాతన శ్మశానవాటికలో దాదాపు పది మందికిపైగా అధికార పార్టీనాయకుల అనుచరులకు పట్టాలు మంజూరు చేశారని, నిర్మాణ పనులు చేపడితే స్థానికులు అడ్డుకున్నారు.

> **ఇది ఫోర్జరీ పట్టా**
>
> 
>
> డీఆర్‌డీఎస్ పట్టాలో ఇచ్చిన సంతకం నాదికాదు. ఇది ఫోర్జరీ సంతకం ఇందులోని రాతలు మా రెవెన్యూ సిబ్బందివి కావు. ఫోర్జరీ సంతకాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా.
>
> \- డిప్యూటీ తహసీల్దార్ శంకర్

పట్టాల మంజూరు కోసం రూ.24లక్షలతో ఒప్పందం?



పథకం ప్రకారం 3సెంట్లలో షెడ్లు వేసుకున్న నాయకులు

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం గ్రామం పాత జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో 24 మంది పేరుతో పొజిషన్ సర్టిఫికెట్(పట్టాలు) చేయించుకునేందుకు రూ.24లక్షలు రెవెన్యూ అధికారులు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. 180 సర్వే నంబరులో విలువైన స్థలాన్ని పథకం ప్రకారం రేకుల షెడ్లు వేసేలా దానికి నగరపంచాయతీకి రుసుం చెల్లించి వాటి ఆధారంగా 24 మంది అధికార పార్టీ నాయకులు బినామీ పేర్లతో పట్టాలు చేయించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తొలుత 50శాతం ఇచ్చేలా, పట్టాలు చేతికొచ్చిన తరువాత రెవెన్యూ అధికారులకు మిగిలింది చెల్లించేలా రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారన్న ఆరోపణలు తహసీల్దార్ కార్యాలయంలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ 24మందిలో 18మంది వైసీపీ కౌన్సిలర్లు ఇద్దరు ఓడిపోయిన కౌన్సిల్ అభ్యర్థులు, ముగ్గురు కోఆప్షన్ మెంబర్లు, ఓ సచివాలయ కన్వీనర్ షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున లక్షల విలువచేసే స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకున్నారు. అక్రమ కట్టడాల నిర్మాణ పనులను అడ్డుకుంటున్న అధికారులను అధికార పార్టీ నాయకులు నోరుమూయిస్తున్నారు. వారికి నియోజకవర్గ నేతలతో ఫోన్లు చేయించి చూసీచూడనట్లు వ్యవహరించాలని హుకుం జారీచేసినట్లు తెలిసింది.

> **ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలి**
>
> 
>
> వైఎస్ఆర్ జగనన్న లేఅవుట్‌లో ఉన్న శ్మశానవాటిక స్థలంలో పలువురికి ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలి. అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ అనుచరులకు పట్టా ఇప్పించారు. శ్మశానంలో పనులు చేపడుతున్నారు. పనులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం పనులు ఆపారు. సబ్ కలెక్టర్ చర్యలుతీసుకోవాలి.
>
> \- బోయ అనిల్‌కుమార్, పెనుకొండ



సబ్ కలెక్టర్ బంగ్లా ఎదుట ఉన్న స్థలంలో ఫోర్జరీ పట్టాతో నిర్మాణాలు

> **ఆర్‌అండ్‌బీ స్థలం కబ్జాకు యత్నం**
>
> 
>
> 180 సర్వే నంబరులో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని అధికార పార్టీ కౌన్సిలర్లు కబ్జా చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇంత వరకు ప్రశ్నించలేదు. నగరపంచాయతీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం. ప్రస్తుతానికి పనులు ఆపారు. ఈ స్థలాలకు పట్టాలు చేయించుకునేందుకు 24 మంది నాయకులు రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు చేశారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.
>
> \- రియాజ్‌బాషా, తిమ్మాపురం

> **ఎవరికీ పట్టాలు మంజూరు చేయలేదు**
>
> 
>
> పెనుకొండలో ఎవరికీ పట్టాలు మంజూరు చేయలేదు. సబ్ కలెక్టర్ బంగ్లా సమీపంలో నిర్మాణం చేపడుతున్న స్థలానికి ట్రూకాపీ కింద ఇచ్చిన పట్టా అలా ఇవ్వడానికి వీలులేదు. రికార్డులో పట్టా మంజూరు చేసి ఉంటే దానిని జిరాక్స్‌చేసి అందులో డీటీ సంతకం చేయాలి. కొత్తగా ట్రూకాపీ తయారు చేయడానికి వీలులేదు. జగనన్న లేఅవుట్‌లో ఆన్‌లైన్ ద్వారానే పట్టాలు ఇవ్వాలి. మొదట ఇచ్చిన ఆన్‌లైన్ పట్టా మినహా ప్రజా అవసరాల కోసం ఉన్న ఖాళీ స్థలాల్లో నిర్మాణాలపై ఆరాతీస్తాం.
>
> \- సురేష్‌బాబు, తహసీల్దార్

ఫ్యాక్షన్‌ను రూపుమాపిన పరిటాల రవీంద్ర



పెనుకొండలో పరిటాల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సవిత, నాయకులు



రొద్దంలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 24: ఉమ్మడి అనంత జిల్లాలో ఫ్యాక్షన్‌ను రూపుమాపిన నేత పరిటాల రవీంద్ర అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. బుధవారం పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలను పట్టణంలో నిర్వహించారు. తొలుత స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పట్టణంలో ర్యాలీ, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రామగిరిలోని పరిటాల ఘాట్ వద్ద పెద్దఎత్తున టీడీపీ శ్రేణులతో కలిసి సమాధికి పూలమాలలువేశారు. సవిత మాట్లాడుతూ.. పెనుకొండ నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు పరిటాల రవీంద్ర అన్నారు.

రొద్దం: స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిటాల వర్ధంతిని బుధవారం ఆ పార్టీ నాయకులు వివరించారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పెనుకొండ నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. హిందూపురం పార్లమెంట్ అధికారప్రతినిధి నరసింహులు, కన్వీనర్ నరహరి, రామాంజనేయులు, పెద్దమంతూరు రాము, నారాయణ, పవన్ పాల్గొన్నారు.

పెనుకొండ: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు వెంకటరాముడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవయ్య, శశిభూషణ్, సాయిక్ళ్యాబ్ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, కన్వీనర్ సిద్దయ్య, కన్నాస్వామి, తోటగేరి శీనా, హజురుల్లాఖాన్, జావిద్, బోయ గాయిత్రి, షౌకత్, గుట్టూరు నాగరాజు, ఆదిశేషు, వరప్రసాద్, రబ్బాని, రియాజ్, పోతిరెడ్డి, ప్రభంజన్‌కుమార్, వడ్డినాగప్ప, విజయ్‌కుమార్, దోణి లక్ష్మీనారాయణ, చంద్రమౌళి, షీప్‌ఫాం చంద్ర, శ్రీనివాసులు, నంజుండ, షమున్, సానిపల్లి వెంకటేశ్, శెట్టిపల్లి వెంకటేశ్, నజీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ, జనవరి 24: ఉద్యోగఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్థిక బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉదయం బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని క్రమం తప్పకుండా డీఏలు ఇస్తామని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని అనేక హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. యూటీఎఫ్ రెండో దశ పోరాటాల్లో భాగంగా గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. గౌరవాధ్యక్షుడు బూతన్న, జిల్లా కార్యదర్శి నరేష్, నబీ, కృష్ణానాయక్, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, జోగప్ప, మహలింగప్ప, రామాంజనేయులు శేషాద్రి, ఆది, దినేష్, దివాకర్, శ్రీనివాసులు, నరసింహులు, పెద్దరాజు, వెంకటేశులు, నాగార్జునరెడ్డి, సుబ్బరాయుడు, రమేష్, నరేంద్ర పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట గిరిజనుల ధర్నా

పెనుకొండ రూరల్, జనవరి 24: తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కొండంపల్లి గ్రామ గిరిజనవాసులు బుధవారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మూడు రోజుల క్రితం కొండంపల్లి గ్రామానికి చెందిన అనూషబాయిని అదే గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి ప్రేమ పేరుతో ఇంటినుంచి ఎత్తుకెళ్లాడన్నారు. దీనిపై బాధితురాలి తల్లిదండ్రులు లక్ష్మీబాయి, హనుమంత నాయక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజులు కావస్తున్నా న్యాయం చేయలేదని బుధవారం గిరిజనులు పెద్దఎత్తున స్టేషన్‌వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదని గంటపాటు రోడ్డుపై కూర్చుని నినదించారు. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సీఐ రాజారమేష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురి కుటుంబ సభ్యులను సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అమ్మాయి అనూషబాయి ప్రేమించినవాడే తనకు కావాలని పోలీసుల ఎదుట చెప్పడంతో ఇరువురు ప్రేమజంటను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. అమ్మాయి మేజర్ కావడంతో ఆమె అభీష్టం మేరకు హనుమంతరెడ్డి కుటుంబీకుల వెంట పంపించేశారు.



పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి: సీడీపీఓ

లేపాక్షి, జనవరి 24: బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలికలకు ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


పెనుకొండ: స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని సీడీపీఓ శాంతలక్ష్మి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలికలపై జరిగే హింసకు వ్యతిరేకంగా బాలికలవిద్య ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ పుష్పలత, అంగనవాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణంలో బుధవారం బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత తీవ్రరూపం అవుతోందని, తల్లిదండ్రులు కూడా బాలురు ఎక్కువ బాలికలు తక్కువ అన్న భావన పక్కనపెట్టి సమానంగా చూసుకోవాలన్నారు. ఆర్డీటీ ప్రతినిధి నాగసుదర్శన్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: బాలికల విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిలమత్తూరు: ఒకప్పుడు చిన్నచూపు చూసిన బాలికలే నేడు దేశ ప్రగతిలో కీలకమవుతున్నారని హెచ్‌ఎం లత అన్నారు. బుధవారం కొడికొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, ఎంఎస్‌కే హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పావగడ: స్థానిక హెల్ప్‌సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మానం శశికిరణ్ మాట్లాడుతూ ఆడపిల్లలను సురక్షితంగా పెంచడంతోపాటు శిక్షణపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పౌష్టికాహార కిట్లను బాలికలకు అందించారు. ఆరోగ్య కార్యాలయ సిబ్బంది మంజమ్మ, నవీన్‌శంకర్, శశికళ పాల్గొన్నారు.



లేపాక్షిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీడీపీఓ





గుడిబండ, పావగడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

విగ్రహ ప్రతిష్ఠకు బీకే దంపతులకు ఆహ్వానం

గోరంట్ల, జనవరి 24: పట్టణంలో ఈడిగ సంక్షేమ సంఘం నూతనగా నిర్మించిన రేణుకాయల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, కమలమ్మ దంపతులను ఆహ్వానించారు. ఫిబ్రవరి 10 నుంచి 12వరకు మూడురోజులపాటు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, కమ్యూనిటీ భవనం ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నారు. ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్, డ్రైవర్ వెంకటరాముడు, పాలసముద్రం నారాయణప్ప, టైలర్ క్రిష్ణ, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం



వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి 24: వీరారెడ్డి ఆశాయాలను కొనసాగిద్దామని పట్టు రైతు సంఘం నాయకులు, రీలర్లు అన్నారు. బుధవారం వీరారెడ్డి 19 వర్ధంతిని నిర్వహించారు. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన యోధుడు వీరారెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు పడుతున్న కష్టాలు, వారి కన్నీళ్లు చూసి చలించిపోయాడన్నారు. 2002లో పట్టు రైతుల సమస్యలపై రైలు రోకో చేపట్టి పోలీసులకు ఎదురొడ్డారన్నారు. పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, సోమశేఖర్ రీలర్లు ముస్తఫా, ఖలీల్, అన్సర్ ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురి ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పెనుకొండ, జనవరి 24: స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో బాలాజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆల్‌సెక్ టెక్నాలజీ చెన్నైవారిచే నిర్వహించిన ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన హారిక, నిఖిత, రిజ్వాన, స్వాతి, లక్ష్మి, జమీల్‌ఖాన్ ఎంపికయ్యారన్నారు. వీరికి రూ.2,40లక్షల ప్యాకేజీ ఇచ్చారన్నారు. కంపెనీ మేనేజర్ రవితేజ ఎంపిక పత్రాన్ని అందించారు. బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటక్రిష్ణకిషోర్, ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, కోఆర్డినేటర్ బాబాఫక్రుద్దీన్, ఏఓ కేశవయ్య, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

వీఆర్‌ఓపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం

రొద్దం, జనవరి 24: రొద్దం-2 వీఆర్‌ఓ అనూషపై సబ్ కలెక్టర్ అపూర్వభరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం సబ్ కలెక్టర్ విచ్చేసిన సందర్భంగా బీదానిపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ స్థల వివాదంపై ఫిర్యాదు చేశారు. గతంలో కోగిర వీఆర్‌ఓగా పనిచేసిన అనూష ఎల్‌జీబీ నగర్ గ్రామంలో ఆర్‌అండ్‌బీ స్థలంలో ఇతరులకు ఇంటిపట్టాలు ఇచ్చారు. నాగభూషణం కొనుగోలు చేసిన స్థలం ముందు వీఆర్‌ఓ ఇతరులకు పట్టా ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ కోర్టు ద్వారా నాగభూషణంకు రెండు నెలల క్రితం ఆర్డర్ అయింది. అయితే రెవెన్యూ అధికారులు ఆయనకు న్యాయం చేయకపోవడంతో సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సబ్ కలెక్టర్ వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంఈఓ విజయభాస్కర్, రెవెన్యూ రీసర్వే డీటీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ, జనవరి 24: అంతర్జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో శాంతినికేతన్‌లో చదువుతున్న 23 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 14మంది, సైన్స్ ఒలింపియాడ్‌లో 9మంది గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో హస్నికరెడ్డి, మహ్మద్ అయూబ్ లెవెల్-2కు ఎంపికయ్యారన్నారు. బుధవారం ఉదయం గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు సత్కరించారు.